27న ఓరియంట్ సంఘాలతో సమావేశం

కాసిపేట, జనవరి 20: జిల్లా కేంద్రంలోని లేబర్ కార్యాలయంలో ఈ నెల 27న ఓరియంట్ కార్మిక సంఘాలతో మూడో సమావేశం నిర్వహించనున్నారు. ఓరియంట్‌లో జరిగే గుర్తింపు సంఘం ఎన్నికల కోసం ఈ సమావేశం కీలకం కానుంది. సమావేశంలో ఎన్నికల తేదీని ప్రకటించే అవకాశం ఉంది.

24న మండల సర్వసభ్య సమావేశం

దండేపల్లి, జనవరి 20: దండేపల్లి ఎంపీడీవో కార్యాలయంలో ఈనెల 24న ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వేముల మల్లేషం శనివారం ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సకాలంలో హాజరు కావాలని కోరారు.

అందరూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

హాజీపూర్, జనవరి 20: వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని ఆర్టీవో కిష్టయ్య అన్నారు. జాతీ య రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా శనివారం వేంపల్లి జాతీయ రహదారిపై వాహనాలకు రోడ్డు భద్రత స్టిక్కర్లు అంటించారు. ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని, త్రిబుల్ రైడింగ్ చేయవద్దన్నారు. కారు నడిపేవారు సీటు బెల్టు ధరించాలన్నారు. రోడ్డు భద్రత నియమాలు పాటి స్తూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలుంటాయని తెలిపారు.

నేడు కుంరంభీం విగ్రహావిష్కరణ

కాసిపేట, జనవరి 20: ఆదివాసీల ఆరాధ్య దైవం కుంరంభీం విగ్రహాన్ని దేవాపూర్‌లో ఆదివారం ఆవిష్కరిస్తామని భీం విగ్రహ నిర్వహణ కమిటీ సభ్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీ లారీ యార్డు సమీపంలోని ప్రధాన కూడలి వద్ద భీం విగ్రహాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. మంత్రి సీతక్క, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మీ, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్‌లు హాజరై విగ్రహాన్ని ఆవిష్కరిస్తారని తెలిపారు. ఆదివాసీలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

రాష్ట్రస్థాయి క్యారమ్ పోటీల్లో ద్వితీయ స్థానం

బెల్లంపల్లి, జనవరి 20: క్యారమ్ రాష్ట్ర అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 19, 20 తేదీల్లో హైద్రాబాద్‌లోని ఖైరతాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి క్యారమ్ ఎంపిక పోటీ ల్లో ఆదిలాబాద్ జిల్లాలోని దంతన్‌పల్లికి చెందిన ఎండీ అర్బాజ్‌ఖాన్ ద్వితీయ స్థానం సాధించినట్లు ఉమ్మడి ఆది లాబాద్ జిల్లా క్యారమ్ అసోసియేషన్ కార్యదర్శి బాల రాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శి రాజన్నలు శనివారం తెలి పారు. అండర్ 21 విభాగంలో ఈ ఘనత సాధించినట్లు పేర్కొన్నారు. అర్బాజ్‌ఖాన్‌ను పలువురు అభినందించారు.



- పౌర సరఫరాలశాఖ ఆధ్వర్యంలో తనిఖీలు
- రెండు రోజులుగా జిల్లాలో పర్యటిస్తున్న అధికారులు
- దుకాణాల్లో దర్శనమిస్తున్న డీలర్ల బినామీలు
- నెలవారీ స్టాకు వివరాలపైనా విచారణ

బినామీ రేషన్ డీలర్లపై కొరడా

మంచిర్యాల, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తం గా బినామీ పేర్ల తో రేషన్ షాపులు నిర్వహిస్తున్న వారిపై పౌర సరఫరాల శాఖ అధికారులు కొరడా ఝళిపిస్తున్నారు. కలెక్టర్ బదావత్ సంతోష్ ఆదేశాల మేరకు రెండు రోజులుగా పౌర సరఫరాల శాఖ అధికారులు వివిధ మండలా లపరిధి లోగల రేషన్ దుకాణాల్లో విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నారు. డీలర్‌షిప్ ఎవ రి పేరిట ఉంది..? చౌక ధరల దుకాణాల్లో నెల నెల లబ్ధిదారులకు ఎవరు బియ్యం పోస్తున్నారు..? అనే విషయమై విచారణ జరుపుతున్నారు. రాష్ట్రంలో బోగస్ రేషన్ డీలర్ల ఆట కట్టించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలం టూ ప్రభుత్వం నుంచి జారీ అయిన ఆదేశాల మేరకు పౌర సరఫరాలు, రెవె న్యూ శాఖల అధికారులు వేర్వేరుగా తనిఖీలు చేపడుతున్నారు. అధికారుల తనిఖీలో బినామీ డీలర్ల బాగోతం వెలుగు చూస్తున్నట్లు తెలుస్తోంది.

లైసెన్స్ ఒకరిది.. నిర్వహణ మరొకరిది..

రేషన్ షాపుల్లో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులకు విస్తుపోయే నిజాలు వెలుగు చూస్తున్నాయి. డీలర్‌షిప్ ఒకరి పేరిట ఉండగా, సరు కులు పంపిణీ చేసేందుకు మరొకరు రేషన్ షాపుల్లో దర్శనమిస్తుం డటంపై అధికారులు విచారణ జరుపుతున్నారు. శనివారం జిల్లా కేంద్రం లోని పలు దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన అధికారుల దృష్టికి డీలర్లకు బదులు బినామీలు అందుబాటులోకి వచ్చారు. బినామీలు ఉన్నచోట అసలు డీలర్ ఎవరనే విషయాన్ని నమోదు చేసుకున్న అధికా రులు నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నారు.

జిల్లాలో 311 గ్రామ పంచాయతీల పరిధిలో మొత్తం 423 చౌక ధరల దుకాణాలు అందుబాటులో ఉన్నాయి. వీటి పరిధిలో జిల్లాకు సంబంధించి మొత్తం 2 లక్షల 14 వేల 236 మందికి రేషన్ కార్డులు ఉన్నాయి. ఆయా దుకాణాల ద్వారా కార్డులున్న లబ్ధిదారులకు రేషన్ అందుతోంది. జిల్లాలోని మొత్తం రేషన్ కార్డుల్లో అంత్యోదయ కార్డుల లబ్ధిదారులు 15,417 ఉండగా, ఆహార భద్రత కార్డులు 1 లక్ష 98వేల 649, అన్నపూర్ణ 170 కార్డులు ఉన్నాయి. ఆయా షాపుల పరిధిలోని లబ్ధిదారులకు పంపిణీ చేయడానికి ప్రతి దుకాణానికి సగటున 120 క్వింటాళ్లు సరఫరా అవుతాయి. అయితే జిల్లాలోని 423 దుకాణాలకుగాను అధికశాతం బినామీలే నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. దాదాపు 200 వరకు బినామీ డీలర్లు నిర్వహిస్తున్న షాపులే ఉంటాయని సమాచారం. డీలర్ లైసెన్స్‌లు ఒకరి పేరిట ఉండగా, అనేక షాపులను బినామీలే నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. బినామీ పేర్లతో నిర్వహిస్తున్న రేషన్ షాపులను కట్టడి చేయడానికి ప్రభుత్వం సన్నద్ధమవు తోంది. అర్హులకే రేషన్ షాపులు దక్కేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది.

నెలవారీ స్టాకు పైనా విచారణ

రేషన్ షాపుల్లో తనిఖీలు చేపడుతున్న అధికారులు పనిలో పనిగా నెలవారీ స్టాకుపై విచారణ జరుపుతున్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు చౌకధరల దుకాణాల్లో ప్రతీ నెల 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు బియ్యం పంపిణీ చేపట్టాల్సి ఉంది. అయితే అనేక షాపుల్లో కొద్ది నెలలుగా నిర్ణీత సమయానికి బియ్యం పోయడం లేదనే ఆరోపణలున్నాయి. నిర్ణీత గడువు ముగిసినా లబ్ధిదారులకు బియ్యం అందకపోవడం, పత్రికల్లో కథనాలు రావడంతో ఉన్నతాధికారులు విచారణ జరుపుతున్నారు. ఇందులో భాగంగానే ప్రతి షాపులోని స్టాకును మండల లెవల్ స్టాకిస్ట్ (ఎంఎల్ ఎస్) పాయింట్ రికార్డులతో అధికారులు సరిపోల్చుతున్నారు. లబ్ధిదారులకు బియ్యం అందించడంలో ఆలస్యానికి కారణం తెలుసుకునే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.

వివిధ మండలా ల్లోని ఎంఎల్‌ఎస్ పాయింట్ల నుంచి బియ్యాన్ని చౌక ధరల దుకాణాలకు సరఫరా చేసేందుకు సరిపడా లారీలు అందుబాటులో లేక పోవడం ఒక కారణమైతే స్టాకు ఎప్పుడు అందుతుందో తెలియక కొన్ని చోట్ల డీలర్లు షాపులను మూసి ఉంచడం మరో కారణంగా తెలుస్తోంది. స్టేజీ-2 కాం ట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా సకాలంలో లారీలు అందుబాటులో ఉండక పోవ డంతో దుకాణాలకు బియ్యం ఆలస్యంగా చేరుతున్నాయని గ్రహించిన అధికారులు అవసరమైన చర్యలు చేపట్టేందుకు సిద్ధపడుతున్నారు.



రేషన్ షాపుల్లో తనిఖీలు నిర్వహిస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ వరదరాజు

సృజనాత్మకతతో అద్భుతాలు సృష్టించవచ్చు



బుక్‌లెట్‌లను విడుదల చేస్తున్న రాష్ట్ర ఎన్నికల కమిషనర్, కలెక్టర్

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 20 : వినూత్న ఆలోచన, క్రమశిక్షణతో సృజనాత్మకతను జోడించి అద్భుతాలు సృష్టించవచ్చని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ఔత్సాహిక సినీ, టీవీ దర్శకుల, రచయితల శిక్షణ శిబిరానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రచయితలు, దర్శకులు విమర్శకులు, విశ్లేషకుల ప్రశంసలు పొంది ప్రేక్షకులకు వినోదం అందించేందుకు కృషి చేయాలని, క్రమశిక్షణతో పనిచేస్తే మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. తెలుగు సినీ రంగం అంతర్జాతీయ స్థాయిలో ఆస్కార్ అవార్డు అందుకునే స్థాయికి ఎదగడం గర్వంగా ఉందన్నారు. కలెక్టర్ బదావత్ సంతోష్ మాట్లాడుతూ జిల్లాలోని దర్శకులు, కళాకారులు, రచయితలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. మార్చిలో నాయకపోడ్ ఆదివాసీల ఆధ్వర్యంలో జరిగే జాతర ఆకర్షణీయంగా ఉంటుందని, ఈ వేడుకను ప్రపంచానికి తెలియజేసే విధంగా కృషి చేయాలన్నారు. అనంతరం చాకలి ఐలమ్మ డాక్యుమెంటరీ చిత్రాన్ని, తెలంగాణ బుక్, తెలంగాణ ఓరుగల్లు, తెలంగాణ క్విట్ ఇండియా, తెలంగాణ కోర్సు బుక్‌లెట్‌లను ఆవిష్కరించారు. అనంతరం చిన్నారులు నృత్యాలు చేసి అలరించారు. అదనపు కలెక్టర్ రాహుల్, తెలుగు సినీదర్శకుల సంఘం ప్రధాన కార్యదర్శి వీఎన్ ఆదిత్య, తెలుగు టెలివిజన్ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేష్‌కుమార్, వీవీకే హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్ విజయ్‌కుమార్, టెలివిజన్ రచయితల సంఘం అధ్యక్షుడు శ్రీశైలమూర్తి, ప్రేంరాజ్, హనుమాండ్ల మధు, జిల్లా సమాఖ్య అధ్యక్షుడు విశ్వేశ్వర శర్మ, ప్రధాన కార్యదర్శి అంతడుపుల నాగరాజు, రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి నరేందర్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష

ఏసీసీ, జనవరి 20: జిల్లాలో జవహర్ నవోదయ విద్యాలయాల ప్రవేశ పరీక్ష శనివారం ప్రశాంతంగా ముగి సింది. ఆరో తరగతి ప్రవేశం కోసం నిర్వహించిన ఈ పరీ క్షకు జిల్లా కేంద్రంతో పాటు లక్సెట్టిపేట, చెన్నూరు, మం దమర్రి, బెల్లంపల్లిల్లో ఏడు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. 1188 మంది విద్యార్థులకుగాను 979 పరీక్షకు హాజరయ్యారు. 209 మంది గైర్హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా అన్ని కేంద్రాల్లో పరీక్ష సజావుగా ముగిసినట్టు డీఈవో యాదయ్య తెలిపారు.

విధులకు పాఠశాల హెచ్‌ఎం డుమ్మా

కోటపల్లి, జనవరి 20: నందరాంపల్లె ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం శనివారం పాఠశాలకు గైర్హాజరు కావడం, విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించకపోవడం పలు విమర్శలకు దారి తీసింది. పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడితోపాటు మరో ఉపాధ్యాయుడు విధులు నిర్వహిస్తున్నారు. ప్రధానోపాధ్యాయుడు వేణుమాధవ్ సక్రమంగా విధులకు హాజరు కావడం లేదని, పేరెంట్స్ టీచర్స్ సమావేశం నిర్వహించలేదని గ్రామస్తులు తెలిపారు. దీనిపై విచారణ జరిపి సదరు హెచ్‌ఎంపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఎంఈవో తిరుపతిరెడ్డిని వివరణ కోరగా ఈ విషయం తనకు తెలియదన్నారు. సిర్సా స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం మొగిలిని వివరణ కోరగా హెచ్‌ఎం లీవు పెట్టలేదని పేర్కొన్నారు.

ఆలయాలను శుభ్రం చేయాలి

బెల్లంపల్లి, జనవరి 20 : అయోధ్యలో ఈ నెల 22న రామమందిర ప్రాణ ప్రతిష్ఠ జరుగుతున్న సందర్భంగా ప్రధాని మోదీ పిలుపు మేరకు స్వచ్ఛ తీర్థ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని ఆలయాలను శుభ్రం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొయ్యల ఏమాజీ కోరారు. శనివారం లంబాడితండాలోని దుర్గాదేవి ఆలయాన్ని శుభ్రం చేశారు. ఈ నెల 22న ఇండ్లలో దీపాలు వెలిగించాలన్నారు. నాయకులు గోవర్ధన్, శ్రీనివాస్, స్వామి, కమల, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

108 అంబులెన్స్‌లో ప్రసవం



అంబులెన్స్‌లో తల్లి శిశువుతో సిబ్బంది

వేమనపల్లి, జనవరి 20: మండలంలోని జాజులపేట గ్రామానికి చెందిన పూజిత 108 అంబులెన్స్‌లో మగబిడ్డకు జన్మనిచ్చింది. పూజితకు శనివారం తెల్లవారుజామున పురుటి నొప్పులు రావడంతో కుటుంబీకులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అంబులెన్స్ సిబ్బంది రమేష్, ముజమ్మిల్ గ్రామానికి చేరుకుని పూజితను చెన్నూరు ఆసుపత్రికి తీసుకువెళ్తుండగా మార్గమధ్యలో నీల్వాయి అటవీ ప్రాంతంలో పురుటినొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో అంబులెన్స్ సిబ్బంది డాక్టర్ల సూచనలతో పురుడు పోయగా మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లిబిడ్డ క్షేమంగా ఉండడంతో చెన్నూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మత్తు పదార్థాల నియంత్రణకు కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 20: మత్తు పదార్థాల వినియోగం యువత భవిష్యత్‌కు నిరోధకమని, మత్తు పదార్థాల నియంత్రణకు కృషి చేయాలని కలెక్టర్ బదావత్ సంతోష్ పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా అటవీ శాఖ అధికారి శివ్ ఆశిష్‌సింగ్, డీసీపీ సుధీర్ రాంనాథ్‌కేకన్‌తో కలిసి పోలీసు, విద్య, వైద్యం, అటవీ, వ్యవసాయ తదితర శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలు, మద్యానికి బానిసై జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. జిల్లాలో నిషేధించబడిన మత్తు పదార్థాల రవాణా, విక్రయాలపై నిఘా ఏర్పాటు చేసి చర్యలు తీసుకోవాలన్నారు. గంజాయి సాగు జరగకుండా వ్యవసాయ, అటవీ ,రెవెన్యూ శాఖల అధికారులు సమన్వయంతో పర్యవేక్షించాలన్నారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల జరిగే నష్టాలపై పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ఎక్కడైనా మత్తు పదార్థాల వినియోగం, విక్రయాల సమాచారం తెలిస్తే ప్రజలు పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో సుబ్బారాయుడు, జిల్లా సంక్షేమాధికారి చిన్నయ్య, అధికారులు పాల్గొన్నారు.

అర్హులను ఓటరు జాబితాలో నమోదు చేయాలి

జిల్లాలో 18 సంవత్సరాలు నిండిన వారితోపాటు దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్ల వివరాలను ఓటరు జాబితాలో నమోదు చేయాలని కలెక్టర్ బదావత్ సంతోష్ పేర్కొన్నారు. శనివారం మంచిర్యాల పట్టణంలోని మజీదువాడలో 190, 191, అశోక్‌రోడ్డులోని 202, హమాలీవాడలోని 199, 200, 201 పోలింగ్ కేంద్రాల్లో నూతన ఓటరు నమోదు, మార్పుల, తొలగింపుల కోసం నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరాన్ని ఆర్డీవో రాములుతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎలాంటి పొరపాట్లు లేని స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించేందుకు బూత్ స్థాయి అధికారులు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ద్వారా నియమించిన ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన వారందరు ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు.

విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకుని చదవాలి





కాసిపేటలో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో యాదయ్య, జైపూర్‌లో మాట్లాడుతున్న ఎంపీడీవో

వేమనపల్లి, జనవరి 20: విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకుని చదువులో ముందుకు సాగాలని అదనపు కలెక్టర్ రాహుల్ పేర్కొన్నారు. శనివారం నీల్వాయిలోని కస్తూర్బాగాంధీ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదువుకున్నప్పుడే మంచి ఫలితాలు సాధిస్తారన్నారు. విద్యతోనే ప్రతీ ఒక్కరు ఉన్నత స్థాయికి చేరుకుంటారని, సమాజంలో మంచి గుర్తింపు, గౌరవం, హోదా లభిస్తుందన్నారు. ప్రతీ విద్యార్థి ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటూ ముందుకు సాగాలన్నారు. ఉన్నత విద్యను అభ్యసిస్తే మంచి ఉద్యోగాల్లో స్థిరపడవచ్చని తెలిపారు. అనంతరం నీల్వాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. పదో తరగతిలో మంచి మార్కులు సాధించాలని విద్యార్థులకు సూచించారు. తహసీల్దార్ సదానందం, ఎంపీడీవో లక్ష్మయ్య, ఎంపీవో బాపురావు, సర్పంచు గాలి మధు, ఎంఈవో తిరుపతి రెడ్డి, వైద్యాధికారి రాజేష్, ఏపీవో సత్యప్రసాద్, వెటర్నరీ డాక్టర్ అరుణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సువర్ణ, హెచ్‌ఎం గిరిధర్‌రెడ్డి, కస్తూర్బా ప్రిన్సిపాల్ మయూరి తదితరులు పాల్గొన్నారు.

కాసిపేట: పదో తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని డీఈవో యాదయ్య అన్నారు. శనివారం జిల్లా పరిషత్ పాఠశాలను సందర్శించి విద్యార్థులను గణితంలో పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో వంద శాతం హాజరు శాతం ఉండేలా ఉపాధ్యాయులు చొరవ చూపాలన్నారు. పదిలో వెనకబడిన వారిని గుర్తించి వారి విద్యా సామర్థ్యాలను పెంచాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలుంటాయని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు సాంబమూర్తి, ఉపాధ్యాయులు రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జైపూర్: విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదువుకోవాలని ఎంపీడీవో సత్యనారాయణ పేర్కొన్నారు. కేజీబీవీ పాఠశాలలో విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. ఆర్థికంగా ఎదగాలంటే విద్య ముఖ్యమని తెలిపారు. ఎస్‌ఐ ఉపేందర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విద్యాసాగర్‌రావు, ఏవో మార్క్ గ్లాడ్‌సన్, మెడికల్ ఆఫీసర్ సింధూర, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కవిత, కేజీబీవీ ప్రిన్సిపాల్ ఫణిబాల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భీమారం: కస్తూర్బాగాంధీ విద్యాలయంలో కెరీర్ గైడెన్స్‌పై అధికారులు విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ విశ్వంభర్‌లు మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకుని ముందుకు సాగాలన్నారు. పదో తరగతి విద్యార్థులు ప్రణాళికతో చదివితే మంచి ఫలితాలు వస్తాయన్నారు. పరీక్షల సమయంలో ఒత్తిడికి గురి కావద్దని సూచించారు. వెటర్నరీ డాక్టర్ రాకేష్ శర్మ, ప్రధానోపాధ్యాయుడు విక్రమ్, ఎస్‌వో కనకలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

కన్నెపల్లి: విద్యతోనే సమాజంలో గుర్తింపు వస్తుందని తహసీల్దార్ దత్తు ప్రసాద్‌రావు, ఎంపీడీవో రాధాకిషన్‌లు పేర్కొన్నారు. కస్తూర్బాగాంధీ విద్యాలయంలో విద్యార్థినులకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు ఆర్థికంగా ఎదగాలంటే విద్య ముఖ్యమని తెలిపారు. పాఠాలను శ్రద్ధగా వింటూ సందేహాలను నివృత్తి చేసుకోవాలన్నారు.

భీమిని: కస్తూర్బా బాలికల ఆశ్రమ పాఠశాలలో శనివారం 9, 10 తరగతి విద్యార్థులకు కెరీర్ పై అధికారులు అవగాహన కల్పించారు. ఎంపీడీవో జవహర్‌లాల్ విద్యార్థులకు సూచనలు, సలహాలు అందించారు. ఆధునిక ప్రపంచంలో ముందుకు వెళ్లడానికి అవసరమైన లక్షణాలు, పర్సనాలిటీ డెవలప్మెంట్ వంటి అంశాలపై సూచనలు చేశారు. ఎంపీఓ సప్దర్ అలీ, ఎస్సై ప్రశాంత్, డీటీ అంజయ్య, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు కృష్ణమూర్తి, ఏఈపీఆర్ రాంచందర్, ఎస్‌ఓ కవిత, ఏపీఓ భాస్కర్‌రావు, కార్యదర్శి సత్యనారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాహుల్

నెన్నెల: విద్య ఉంటే పేరు, ప్రతిష్ఠలు వెన్నంటి వస్తాయని ఎంపీడీవో వరలక్ష్మి అన్నారు. కస్తూర్బాగాంధీ విద్యాలయంలో కెరీర్ గైడెన్స్ ప్రోగ్రాం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ పదో తరగతి జీవితంలో ఓ మైలురాయి లాంటిదన్నారు. జీవితంలో ఉన్నత స్థానాల్లో స్థిరపడి జన్మనిచ్చిన తల్లిదండ్రులకు, చదువు నేర్పిన గురువులకు మంచిపేరు తేవాలని కోరారు. సర్పంచ్ తోట సుజాతశ్రీనివాస్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లక్ష్మణ్, వెటర్నరీ వైద్యులు దిలీప్, ఎంపీవో శ్రీనివాస్, కేజీబీ ఎస్‌వో పాల్గొన్నారు.

కోటపల్లి: విద్యార్థులు బాగా చదివి ఉద్యోగాలు పొంది వృద్ధిలోకి రావాలని ఎంపీడీవో భాస్కర్ అన్నారు. కస్తూర్బాగాంధీ విద్యాలయంలో విద్యార్థుల కెరీర్‌పై సలహాలు, సూచనలు ఇచ్చారు. క్రమశిక్షణతోపాటు నైతిక విలువలు పెంపొందించుకోవాలని, విద్యలో రాణించాలన్నారు. స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఏవో మహేందర్, వైద్యాధికారి సత్యనారాయణ, ప్రత్యేకాధికారిణి హరిత తదితరులు పాల్గొన్నారు. పారుపెల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశంలో హెచ్‌ఎం గుండేటి యోగేశ్వర్ సూచనలు చేశారు.

చెన్నూరు: కేజీబీవీ పాఠశాలలో కెరీర్ గైడెన్స్‌పై తహసీల్దార్ మల్లికార్జున్, ఎంఈవో రాధాకృష్ణమూర్తిలు విద్యార్థులకు అవగాహన కల్పించారు. క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. సమాజంలో డబ్బుతోపాటు గౌరవం విద్యతోనే లభిస్తుందన్నారు. ఎస్‌ఐ వెంకటేశ్వర్‌రావు, మెడికల్ ఆఫీసర్ కృష్ణతేజ, ఏపీవో గంగాభవానీ, ఏఈ శ్రీనివాస్, ఏపీఎం ప్రమీల , ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దండేపల్లి: ప్రతీ విద్యార్థి పోటీతత్వంతో చదువుకోవాలని ఎంపీడీవో వేముల మల్లేషం సూచించారు. కస్తూర్బాగాంధీ విద్యాలయంలో కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. సమయాన్ని వృథా చేయకుండా క్రమశిక్షణతో చదువుకొని ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా కృషి చేయాలన్నారు. విద్యాలయ ప్రత్యేక అధికారి మంజుల, అధికారులు అంజిత్‌కుమార్, డాక్టర్ సతీష్, ధన్‌రాజ్, వాణి, విక్రమ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోండి

కాసిపేట, జనవరి 20 : ప్రధానమంత్రి కౌషల్‌కేంద్రం ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ, యువకులకు కేంద్ర ప్రభుత్వం అందించే ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కౌషల్ కేంద్రం నిర్వహణ అధికారి దేవేందర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణలో 5జీ టెక్నీషియన్, డ్రోన్, ఎలక్ట్రానిక్స్, సోలార్ ప్యానల్ ఇన్‌స్టాలేషన్ కోర్సులతోపాటు కంప్యూటర్, ట్యాలీ, స్పోకెన్ ఇంగ్లీషు కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తారన్నారు. విద్యావంతులైన 14 నుంచి 45 సంవత్సరాల నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిక్షణ కోసం ఈనెల 29లోగా జిల్లా కేంద్రంలోని కొటక్ మహీంద్ర బ్యాంకు సమీపంలోని కౌషల్ కేంద్రం కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 7095780999లో సంప్రదించాలన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

మందమర్రిటౌన్, జనవరి 20 : మందమర్రి మున్సిపాలిటీలో చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి ఆదివారం పర్యటించనున్నారు. ఎంఎస్‌ఆర్ గార్డెన్‌లో పద్మశాలి సంఘం సమావేశానికి హాజరు కానున్నారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించనున్నారు. అభివృద్ధి పనులపై మున్సిపల్ అధికారులతో సమావేశం నిర్వహించనున్నారు.


ఘనంగా రామాయణ మహాయాగం





విశ్వనాథ ఆలయం నుంచి కలశాన్ని తీసుకువస్తున్న ఎమ్మెల్యే దంపతులు, హోమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు దంపతులు

ఏసీసీ, జనవరి 20: అయోధ్యలో రామమందిర ప్రారంభోత్సవాన్ని పుర స్కరించుకొని జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు-సురేఖ ఆధ్వర్యంలో రామాయణ మహాయాగం కార్యక్రమం చేపట్టారు. జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో మూడు రోజుల పాటు సుదర్శన నారసింహా సహిత విశ్వశాంతి రామాయణ మహాయాగం నిర్వహించ నున్నారు. మొదటి రోజు శనివారం విశ్వనాథ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి యజ్ఞ కలశాన్ని, దేవతామూర్తులతో మహిళల కోలాటాల మధ్య శోభాయాత్రగా బయలుదేరి పాఠశాల మైదానానికి ఎమ్మెల్యే దంపతులు చేరుకున్నారు. అనంతరం వేదపండితుల నేతృత్వంలో యజ్ఞం నిర్వహించి అనంతరం సీతారామచంద్రస్వామి విగ్రహాలను ప్రతిష్ఠించి యాగం నిర్వ హించారు. మహాగణపతి, పుణ్యాహవచనం, అనంతరం తీర్థ ప్రసాదాల విత రణ, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం విష్ణు సహస్ర నామ, లలితా పారాయణం భజన కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తూముల నరేష్, బ్లాక్ అధ్యక్షుడు పూదరి తిరుపతి, ఫ్లోర్ లీడర్ ఉప్పలయ్య, చిట్ల సత్యనారాయణ, కొండా చంద్రశేఖర్, రజిత, మహిళా భక్తులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.









కొండగట్టులో భక్తుల రద్దీ

మల్యాల, జనవరి 20: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానం శనివారం భక్తులతో పోటెత్తింది. వేలాదిగా భక్తులు వేకువజాము నుంచే స్వామి వారి దర్శనానికి బారులుతీరారు. అంజన్నను దర్శించుకున్న అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారికీ మొక్కులు తీర్చుకున్నారు. దాదాపు ఇరవై వేలకు పైగా భక్తులు అంజన్నను దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు.





రెండు ద్విచక్ర వాహనాలు ఢీ

● ముగ్గురికి గాయాలు

భీమిని, జనవరి 20 : మండల కేంద్రం నుంచి లక్ష్మీపూర్ వెళ్లే రహదారి మహదేవ్ తలాబ్ వద్ద శనివారం ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. తాండూరు మండలం రేచిని గ్రామానికి చెందిన నాంచర్ల సత్తన్న, నాంచర్ల అశోక్‌లు ద్విచక్ర వాహనంపై భీమిని మండల కేంద్రంలోని బంధువుల వద్దకు వెళ్తున్నారు. భీమిని మండల కేంద్రానికి చెందిన మొర్ల దేవాజి లక్ష్మీపూర్ వైపు వెళ్తుండగా మూల మలుపు వద్ద ఉన్న మహదేవ్ తలాబ్ వద్ద ఎదురెదురుగా ఢీకొన్నాయి. ముగ్గురు తలలకు గాయాలు కావడంతో 108 వాహనంలో బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నాంచర్ల అశోక్ పరిస్థితివిషమంగా ఉండటంలో మంచి ర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు కుటుంబీకులు తెలిపారు.

ప్రేమ పేరుతో బాలికను మోసం చేసిన యువకుడు

మందమర్రిటౌన్, జనవరి 20 : పట్టణంలోని రామన్ కాలనీకి చెందిన ఓ యువకుడు అదే కాలనీకి చెందిన బాలికను ప్రేమ పేరుతో మోసం చేశాడు. ఇంటర్ విద్యార్థినితో యువకుడు ప్రేమ వ్యవహారం నడిపిం చడం, విద్యార్థినీ కాలేజీకి వెళ్లడం, బైక్ పై తిరగడంతో విద్యార్థిని తల్లిదం డ్రులకు విషయం తెలిసింది. శారీరకంగా వాడుకొని వివాహం చేసుకోనని తెలుపడంతో తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మైనర్ బాలికను ప్రేమ పేరుతో మోసం చేసిన యువకునిపై పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిసింది.







ఓటర్ నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి



ఓటు నమోదు తీరును పరిశీలిస్తున్న ఆర్డీవో, తహసీల్దార్

దండేపల్లి, జనవరి 20: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, అర్హులైన ఓటర్ల సద్వినియోగం చేసుకోవాలని రెవెన్యూ డివిజనల్ అధికారి వాడాల రాములు అన్నారు. శనివారం ఉన్నత పాఠశాలలో బీఎల్‌వోలు నిర్వహించిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఓటర్ల మార్పు చేర్పుల వివరాలు, చనిపోయిన వివరాలపై ఆరా తీశారు. 18 ఏళ్ల నిండిన ప్రతీ ఒక్కరు ఓటు హక్కు నమోదు చేసుకోవాలన్నారు. చిరునామా, పోలింగ్ కేంద్రాల మార్పు తప్పు, ఒప్పులపై దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనంతరం పలు రైస్‌మిల్లులను సందర్శించి ధాన్యం నిల్వలను పరిశీలించారు. తహసీల్దార్ సంధ్యారాణి, ఆర్ఐ భూమన్న, ప్రధానోపాధ్యాయులు శంకర్‌గౌడ్ పాల్గొన్నారు.

హాజీపూర్: నంనూర్‌లోని 123, 124 పోలింగ్ కేంద్రాల్లో ఓటరు జాబితా ప్రత్యేక శిబిరాలను ఆర్డీవో రాములు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన వారందర్నీ ఓటర్లుగా నమోదు చేయాలని బీఎల్‌వోలకు సూచించారు. హాజీపూర్‌లోని మహాలక్ష్మీ రైసుమిల్లును పరిశీలించారు. సీఎంఆర్ బియ్యాన్ని త్వరగా ప్రభుత్వానికి అప్పగించాలని సూచించారు. డిప్యూటీ తహసీల్దార్ హరిత, ఆర్ఐ ప్రభు, మంగ ఉన్నారు.

కన్నెపల్లి: జన్కాపూర్ గ్రామంలోని పోలింగ్ కేంద్రంలో ఓటరు నమోదు కార్యక్రమాన్ని తహసీల్దార్ దత్తు ప్రసాద్‌రావు పరిశీలించారు. అర్హుల నుంచి ఓటరు దరఖాస్తు ఫారాలను స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన వారందరు ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఎల్‌వోలు పాల్గొన్నారు.

కాసిపేట: మండలంలో ఆదివారం, సోమవారం చేపట్టే ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ భోజన్న శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌వోలు అందుబాటులో ఉంటారని, 18 సంవత్సరాలు నిండిన వారందరు ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు.

వేమనపల్లి: నీల్వాయి పాఠశాలలోని రెండు పోలింగ్ కేంద్రాలను అదనపు కలెక్టర్ రాహుల్ పరిశీలించారు. బీఎల్‌వోలకు సూచనలు చేశారు. 18 ఏండ్లు నిండిన వారందరు ఓటరుగా నమోదు చేయాలని సూచించారు. ఎంపీడీవో లక్ష్మయ్య, తహసీల్దార్ సదానందం, ఎంపీవో బాపురావు, సర్పంచు మధు, ఎంఈవో తిరుపతిరెడ్డి, హెచ్‌ఎం గిరిధర్‌రెడ్డి ఉన్నారు.

ఏసీసీ: మంచిర్యాల పట్టణంలో 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని నాయబ్ తహసీల్దార్ అంజలీ అన్నారు. పట్టణంలోని వివిధ పోలింగ్ బూత్‌లను సందర్శించి కొత్త ఓటరు నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ రెండు రోజుల పాటు నిర్వహించే ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కళాబృంద ప్రదర్శన

రెబ్బెన, జనవరి 20: రెబ్బెన మండల కేంద్రంలో శనివారం తెలంగాణ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ వారి ఆధ్వర్యంలో డీఎంహెచ్‌వో సహకారంతో జన జాగృతి కళాబృందం సభ్యులు ఎయిడ్స్‌పై కళా ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎయిడ్స్ వ్యాధి సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీం లీడర్ గణేష్, గాయకులు శంకర్, గౌతం, గణేష్, ప్రవళిక, సభ్యులు పాల్గొన్నారు.

విస్తరిస్తున్న మహమ్మారి

- అవగాహనతోనే హెచ్ఐవీపై నివారణ - వారం రోజులపాటు కళాజాత - బాధితులను ఆదుకుంటున్న ప్రభుత్వం - పింఛన్‌తోపాటు మందులు



జిల్లా కేంద్రంలో హెచ్ఐవీపై కళాకారుల ప్రదర్శన

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 20: ఎయిడ్స్ మహమ్మారి విస్తరిస్తోంది. నిర్లక్ష్యం, పట్టింపులేని తనం మూలంగా జరిగే శృంగార కార్యకలాపాలతో ప్రాణాంతకమైన హెచ్ఐవీ మహమ్మారి కోరల్లో చిక్కుకుని బాధితులు విలవిలలాడుతున్నారు. హెచ్ఐవీపై అవగాహన కల్పించేందుకు వారం రోజులపాటు కళాజాత కార్యక్రమాలు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. వైద్య ఆరోగ్యశాఖ, ఎయిడ్స్ నియంత్రణ జిల్లా శాఖ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తూ అవగాహన కల్పిస్తున్నారు. దశాబ్దన్నర క్రితం ఈ వ్యాధి పట్ల అవగాహన లేమితో ప్రజలు ఆందోళన పడ్డారు. ప్రస్తుతం నివారణ మార్గాలు, జాగ్రత్తలు పాటిస్తే వ్యాధి నియంత్రించడం కష్టంకాదని వైద్యులు పేర్కొంటున్నారు. జిల్లాలో హెచ్ఐవీ బాధితులు 1620 మంది ఉన్నారు.

హెచ్ఐవీ నియంత్రణకు కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించడంతో వారం రోజుల పాటు క్షేత్రస్థాయిలో ప్రచారం చేయాలని ఆరోగ్య శాఖ అధికారులు నిర్ణయించారు. మంచిర్యాలలో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు అవగాహన కార్యక్రమాలను ముమ్మరం చేశారు. కళాకారుల చేత ఆటాపాటల ద్వారా హెచ్ఐవీ ఎలా వస్తుందని, నియంత్రణ చర్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ ప్రచారం చేస్తున్నారు.

- బాధితులను ఆదుకుంటున్న ప్రభుత్వం

హెచ్ఐవీ బాధితులను మానవీయ కోణంలో ప్రభుత్వం ఆదుకుంటోంది. జిల్లాలో 1620 మంది బాధితులు ఉన్నారు. వీరికి ప్రతీ నెల రూ.2 వేల పింఛన్ అందిస్తుంది. వ్యాధిగ్రస్తులను సమాజంలో ఎవరు చిన్న చూపు చూడకుండా ఉండాలనే నినాదంతో కార్యక్రమాలు చేపడుతుంది. సహాయ కేంద్రాల ద్వారా ఆపన్నహస్తం అందిస్తుంది. హెచ్ఐవీ సోకిన గర్భిణీలపై ప్రత్యేక చొరవ తీసుకుంటూ శిశువులకు సోకకుండా వైద్య శాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ వ్యాధి తల్లి గర్భం నుంచి బిడ్డలకు వేగంగా సోకుతుందని వైద్యులు పేర్కొంటున్నారు. అప్పుడే పుట్టిన శిశువులకు సురక్షితమైన జీవితాన్ని అందించేందుకు వైద్యాధికారులు కృషి చేస్తున్నారు. తల్లిదండ్రుల అవగాహన లేమితో జరిగిన నష్టాన్ని పూడ్చేందుకు అధునాతన వైద్యం అందిస్తున్నారు. వ్యాధి సోకిన గర్భిణికి రోగ నిరోధక శక్తి పెంపొందించేందుకు నివారణ చర్యలు చేపడుతున్నారు.

అసమానతలను అంతం చేద్దాం... ఎయిడ్స్‌ను నిర్మూలిద్దాం అనే నినాదంతో వైద్యులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. జిల్లాలో కళాకారుల చేత ఎయిడ్స్ నియంత్రణకు వైద్య శాఖ అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ఐదు సహాయక కేంద్రాలు

జిల్లాలో లక్షెట్టిపేట, మంచిర్యాల, మందమర్రి, చెన్నూరు, బెల్లంపల్లిలో ఐసీటీసీ (ఇంటిగ్రేటెడ్ కౌన్సెలింగ్ టెస్టింగ్) కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటి ద్వారా హెచ్ఐవీ పరీక్షలు చేయడంతోపాటు బాధితులకు కౌన్సె లింగ్, మందులు అందజేస్తూ భరోసా కల్పిస్తున్నారు.

అవగాహనతోనే నివారణ సాధ్యం

- సుబ్బారాయుడు, డీఎంహెచ్‌వో



అవగాహన లేకపోవడంతో హెచ్ఐవీ వ్యాధి విస్తరిస్తోంది. అప్రమత్తతోనే వ్యాధిని నివారించవచ్చు. ప్రజలకు అవగాహన కల్పించడానికి కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. సురక్షితం లేని లైంగిక సంబంధాలు ప్రమాదకరం. కౌన్సెలింగ్ కేంద్రాల వద్ద ఎయిడ్స్ బాధితులకు అవగాహన కల్పించడంతోపాటు మందులు అందజేస్తూ భరోసా కల్పిస్తున్నాం. కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇస్తూ ముందుకు సాగుతున్నాం.

ఆత్మస్థైర్యం కలిగి ఉండాలి

- అనిల్‌కుమార్, సూపర్‌వైజర్



హెచ్ఐవీ వ్యాధిగ్రస్తులు ఆత్మస్థైర్యం కలిగి ఉండాలి. యోగా, వ్యాయా మం చేయాలి. పండ్లు, గుడ్లు, పప్పులు, పాలు ఆహారంగా తీసుకోవాలి. వ్యాధి నిరోధక శక్తిపై దాడి చేస్తుంది. ఏఆర్‌టీ మందులు వాడితే రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. మద్యం, పొగాకు, ధూమపానం అలవాట్లను మానుకోవాలి. హెచ్ఐవీ నియంత్రణ కోసం కళాకారుల చేత గ్రామాల్లో, పట్టణాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

పనులు పూర్తయిన అందని తాగునీరు

- రూ. 40 కోట్లతో మిషన్ భగీరథ పనులు పూర్తి



మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఓవర్‌హెడ్ ట్యాంకులు

మందమర్రిటౌన్, జనవరి 20: మందమర్రి పట్టణ ప్రజలు తాగు నీటికి ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపాలిటీలో రూ.40 కోట్లతో చేపట్టిన మిషన్ భగీరథ పనులు పూర్తయ్యాయి. అయినప్పటికీ కొన్ని ప్రాంతాలకు తాగునీరు అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. యాపల్ ఏరియా, దీపక్‌నగర్, ఎస్‌వీ టెంపుల్ ఏరి యా, మున్సిపల్ కార్యాలయం వద్ద ఓవర్ హెడ్ ట్యాంకులు, బ్యాలె న్సింగ్ రిజర్వాయర్, నీటి నిల్వ కోసం సంప్‌లను ఏర్పాటు చేశారు. పట్టణంలో 24 వార్డులు 13 వేల గృహాలు ఉండగా 70 కిలోమీటర్ల మేర ఇంటింటికి పైపులైన్ పనులను పూర్తి చేశారు. గతంలో 5 వేల నల్లా కనెక్షన్‌లు ఉండగా నూతనంగా 5,500 కనెక్షన్‌లు ఇచ్చారు. 50 వేలకు పైగా గృహాలు ఉండడంతో ప్రతీ నెల నల్లా పన్నులు రూ. 10 లక్షల వరకు వస్తుంది. అయినా కొన్ని వార్డుల్లో ప్రజలకు నీటి సరఫరా లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పైపులైన్‌ల లీకేజీతో మిషన్ భగీరథ నీరు వృథాగా పోతుంది. ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి పైపులైన్ ద్వారా మున్సిపాలిటీలోని సంప్‌నకు కనెక్షన్ ఇచ్చారు. ఇప్పటి వరకు కేకే 5 బంగ్లాస్‌ఏరియా, మార్కెట్ ఏరియా, ఎస్‌వీ టెంపుల్‌ఏరియా, కేకే 5 ఫిల్టర్ బెడ్, మూడో జోన్ ఏరియాల్లో మిషన్ భగీరథ నీరు సరఫరా కావడం లేదు. ప్రజలు నీరెప్పుడు అందుతుందని ప్రశ్నిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని, మరమ్మతు చేస్తున్నామని పేర్కొంటున్నారని ప్రజలు తెలిపారు. 'నీటిసరఫరా కాకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

తాగు నీరందించేందుకు చర్యలు - ఎమ్మెల్యే వివేక్

మందమర్రి మున్సిపాలిటీలోని ప్రజలందరికి మిషన్ భగీరథ నీటిని అందించేందుకు కృషి చేస్తాం. నీటి విషయంపై ఈ నెల 22న మిషన్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశాం. ప్రజలకు తాగునీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటాం. ప్రజలకు అధికారులు జవాబుదారీగా పనిచేయాలి.

రాములోరి అక్షింతల శోభాయాత్ర



బొప్పారంలో శోభాయాత్ర నిర్వహిస్తున్న గ్రామస్తులు

కోటపల్లి, జనవరి 20: మండలంలోని బొప్పారంలో శనివారం అయోధ్య పూజిత అక్షింతలతో గ్రామస్తులు శోభాయాత్ర నిర్వహించారు. రాముని చిత్రపటాన్ని పల్లకిలో, అక్షింతలను తలపైన పెట్టుకుని గ్రామంలో శోభాయాత్ర నిర్వహించగా గ్రామస్తులు మంగళహారతులు ఇచ్చారు. ఇంటింటికి అక్షింతలను పంపిణీ చేశారు. మహేష్ తివారీ, వెంకటస్వామి, విశాల్ పాల్గొన్నారు.

కన్నెపల్లి: అయోధ్య శ్రీరామ తీర్థక్షేత్ర ట్రస్టు ద్వారా జన్కాపూర్ గ్రామానికి చెందిన రాముల వారి అక్షింతలకు అభయాంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఇంటింటికి అక్షింతలను పంపిణీ చేశారు. కాంగ్రెస్ నాయకుడు నర్సింగరావు, సర్పంచు వసంతరాజేందర్, మాజీ ఎంపీటీసీ మునిపట్ల సత్తయ్య,భక్తులు పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్: గడప గడపకు జై శ్రీరామ్ అనే కార్యక్రమంలో భాగంగా శనివారం రామకృష్ణాపూర్ మహంకాళి ఆలయ కమిటీ సభ్యులు ఇంటింటికి వెళ్లి జై శ్రీరామ్ అనే నామాన్ని ఇళ్ల ముందు రాశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నిమ్మల సాయి కుమార్, సంపత్, రవీందర్, రాం కిశోర్, హరి ప్రసాద్, నాగరాజు, మహిళలు పాల్గొన్నారు.

మల్లికార్జున స్వామి ఆలయంలో స్వచ్ఛ భారత్

దండేపల్లి,జనవరి 20: నర్సాపూర్ గ్రామంలో శ్రీభమరాంభ మల్లికార్జున స్వామి ఆలయంలో బీజేపీ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని శనివారం చేపట్టారు. ఆలయ పరిసర ప్రాంతమంత శ్రమదానం చేపట్టి చెత్తచెదారం తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం అయోధ్య కరసేవ ఉద్యమంలో పాల్గొన్న బిఎస్ రాములును పూలమాల శాలువతో సత్కారించారు. పార్టీ మండల అధ్యక్షుడు గోపతి రాజయ్య, మండల ఇన్‌చార్జి గుండ ప్రభాకర్, పీఏసీఎస్ చైర్మన్ సురేష్, సర్పంచు లక్ష్మణ్, నాయకులు సురేందర్, సంతోష్, బుచ్చన్న, రాకేష్, మల్లేష్, సతీష్, వెంకటేష్, కిషన్, కొమురయ్య, భీమయ్య, శేఖర్, పెద్దయ్య, రాజేష్, శ్రీనివాస్, చింటు పాల్గొన్నారు.



ఆలయాన్ని శుభ్రం చేస్తున్న బీజేపీ నాయకులు

ఉచిత రక్త పరీక్షలు

ఆసిఫాబాద్‌రూరల్, జనవరి 20: ఆసిఫాబాద్ పట్టణంలోని లయన్స్ భవన్‌లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సీఎస్‌సీ హెల్త్‌కేర్ సహకారంతో శనివారం 218మందికి ఉచిత రక్తపరీక్షలు నిర్వహించినట్లు క్లబ్ అధ్యక్షుడు ఉబెద్‌బిన్ యాహియా తెలిపారు. ఒకసారి తీసుకున్నరక్త నమునాతో 34రకాల పరీక్షలు చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ నాగేశ్వర్‌రావు, సభ్యులు వెంకటరమణ, శంకర్, సంజయ్, ఎన్.శంకర్, వెంకన్న, ఆంజనేయులు, వినాయకరావు, మమతారెడ్డి పాల్గొన్నారు.

రక్తదానం చేసిన అటవీ అధికారులు

ఆసిఫాబాద్ రూరల్, జనవరి 20: ఆసిఫాబాద్ రేంజ్ పరిధిలో పనిచేస్తున్న ఇద్దరు అటవీఅధికారులు తీవ్ర రక్తహీనతతో బాధపడుతున్న మహిళకు రక్తదానం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. రేంజ్ పరిధిలో పనిచేస్తున్న శిక్షణ అధికారి సాయిచరణ్, బీట్ అధికారి ఆకుల రాజేష్ పట్టణానికి చెందిన జులజ్యోతి అనే మహిళ రక్తహీనతతో బాధపడుతుందని సామాజిక మాధ్యమంద్వారా తెలుసుకుని వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి రక్తదానం చేశారు. కార్యక్రమంలో బీట్ అధికారి మహేష్ పాల్గొన్నారు.

ప్రతి మహిళా ఆర్థికాభివృద్ధి సాధించాలి

కెరమెరి, జనవరి 20: మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని జెండర్ స్పెషలిస్ట్ రాణి అన్నారు. జాతీయ బాలికల దినోత్సవాల్లో భాగంగా శనివారం మండల కేంద్రంలో జిల్లామహిళా సాధికారతకేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. మహిళా సాధికారత, బేటీ బచావో- బేటీ పడావో ముఖ్య ఉద్దేశంను వివరించారు. మహిళలు ప్రతీ రంగంలో రాణించాలని, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని భర్త, అత్తింటి వేదింపులకు గురయ్యే మహిళలు, పనిప్రదేశాల్లో లైంగిక వేధింపులకు గురైతే హెల్ప్ లైన్181కు ఫోన్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షురాలు రాధ, ఏపీఎం జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా నవోదయ ప్రవేశపరీక్ష

● 4458 విద్యార్థులకు 3658మంది హాజరు

కాగజ్‌నగర్/ఆసిఫాబాద్, జనవరి 20: కాగజ్‌నగర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతి ప్రవేశపరీక్ష శనివారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఉదయం 11.30నుంచి మధ్యాహ్నం 1.30గంట వరకు నిర్వహించారు. ఉమ్మడిజిల్లాలో 4458 విద్యార్థులు నమోదు చేసుకోగా, ఇందులో 3658మంది హాజరైనట్లు ప్రిన్సిపాల్ చక్రపాణి తెలిపారు. కుమరం భీం జిల్లా నుంచి 1079మందికి 850, ఆదిలాబాద్ జిల్లా నుంచి 983మందికి 819, మంచిర్యాల జిల్లా నుంచి 1079మందికి 979, నిర్మల్ జిల్లా నుంచి 1208మంది విద్యార్థులకు 1055 హాజరైనట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఈసంవత్సరం 82 శాతం విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు వివరించారు.



ఆసిఫాబాద్‌లో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

ప్రెసిడెంట్‌గూడలో భీం దేవుడి ఉత్సవాలు



భీం దేవుడి ఊరేగింపు

సిర్పూర్(యు), జనవరి 20: మండలకేంద్రంలోని ప్రెసిడెం ట్‌గూడలో శనివారం ఆదివాసీల ఆరాధ్యదైవం భీందేవుడి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆదివాసీలు తమ ఆరాధ్యదైవం భీందేవుడికి గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. గ్రామంలో గల ఆలయాలలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆదివారం భీందేవుడికి గంగాజలంతో అభిషేకం చేస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్ర మంలో ఆయా గ్రామల ప్రజలు పాల్గొన్నారు.

అట్టహాసంగా ఎడ్లబండ్ల పోటీలు



విజేతను సన్మానిస్తున్న ఎమ్మెల్యే హరీష్‌బాబు

చింతలమానేపల్లి, జనవరి 20: మండలంలోని బాబాసాగర్ గ్రామంలో శనివారం నిర్వహించిన ఎడ్ల బండ్ల పోటీలు అట్టహాసంగా జరిగాయి. ఈ పోటీల్లో 30కి పైగా ఎడ్ల బండ్లు పాల్గొనగా మొదటి బహుమతి చింతలమానేపల్లికి చెందిన మెంత్యాల వెంకటేష్, రెండో బహుమతి బీమారానికు చెందిన సుమిత్ యాదవ్ సాధించారు. ఎడ్లబండ్ల పోటీలు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో చింతలమానేపల్లి మండల కేంద్రంతోపాటు సమీపమండలాల ప్రజలతో ప్రాంగణ మంతా కిక్కిరిసి పోయింది. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు సుశీల, నానయ్య, నాయకులు సుధాకర్‌రావు, శ్రీశైలం, భీమేష్, మనోహర్, మల్లయ్య, తిరుపతి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

దేశ నిర్మాణంలో సైన్స్ ఒక సాధనం కావాలి: డీఈవో

ఆసిఫాబాద్ రూరల్, జనవరి 20: దేశ నిర్మాణంలో సైన్స్ విద్యాసాధనం కావాలని డీఈవో అశోక్ అన్నారు. శనివారం భారత అంతర్జాతీయ సైన్స్‌ఫెస్టివల్2023 ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను, ప్రధానోపాధ్యాయులను అభినందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫరీదాబాద్‌లోని డీబీటీ తిష్టి ఆర్‌సీబీ క్యాంపస్‌లో ఈనెల17నుచి 20వరకు సైన్స్ ఫెస్టివల్ నిర్వహించారన్నారు. ఫెస్టివల్ ప్రయోగాత్మకంగా అభ్యసనాన్ని ప్రోత్సహిస్తుందని కీలకమైన అంశాలను ప్రత్యేకించి చెప్పడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. వినూత్నమైన శాస్త్ర సాంకేతిక, ఇన్నోవేషన్ ద్వారా దేశనిర్మాణానికి భారత జాతీయ, అంతర్జాతీయ సైన్స్‌ఫెస్టివల్ ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో దహెగాంకు చెందిన ప్రవళిక, మనీషా, కాగజ్‌నగర్‌కు చెందిన కౌశిక్, ఆసిఫాబాద్‌కు చెందిన వర్షిత్, రాస్పెల్లికి చెందిన కృష్ణతేజ, కాగజ్‌నగర్‌కు చెందిన అక్షర్ పాల్గొన్నట్లు తెలిపారు. వీరికి సహాయ ఉపాధ్యాయులుగా తిరుపతయ్య, లక్ష్మీప్రసన్న పాల్గొన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి మధుకర్ పాల్గొన్నారు.

తునికాకు టెండర్లను వెంటనే నిర్వహించాలి

కాగజ్‌నగర్, జనవరి 20: జిల్లాలో తునికాకు సేకరణకు టెండర్లను వెంటనే నిర్వహించాలని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోట శ్రీనివాస్ అన్నారు. శనివారం కాగజ్‌నగర్‌లో కల్లేదార్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయం తర్వాత రెండో పంటగా అటవీ ప్రాంతంలో ఆకుసేరణ ఉందన్నారు. జిల్లా అటవీశాఖ అధికారులు వెంటనే స్పందించి తునికాకు టెండర్లు ప్రారంభించాలన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు మాలశ్రీ, ముంజం ఆనంద్, కల్లేదార్లు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

కౌటాల, జనవరి 20: మండల కేంద్రంలో పీఆర్‌టీయూ క్యాలెండర్‌ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సోమయ్య, ప్రధానోపాధ్యాయుడు హనుమంతు, నారాయణసింగ్, అరుణ్, శ్యాంసుందర్, సాయికిరణ్, రమేష్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడా ప్రాంగణం నిధులపై ఆరా

చింతలమానేపల్లి, జనవరి 20: గంగాపూర్ క్రీడా ప్రాగణం నిధులు దుర్వినియోగంపైన ఎంపీడీవో సుధాకర్, డీఎల్పీవో సురేష్‌బాబుకు ఫిర్యాదు చేయగా శనివారం వారు అరాతీశారు. సర్పంచ్ విలాస్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట కార్యదర్శి అశోక్ ఉన్నారు.

పత్తి కొనుగోళ్ల నిలిపివేత

జైనూర్, జనవరి 20: మండల కేంద్రంలోని రెండు జిన్నింగ్ మిల్లులలో సీసీఐ ద్వారా చేపడుతున్న పత్తి కొనుగోళ్లను ఈ నెల 22న నిలిపివేస్తున్నట్లు మార్కెట్ కమిటీ కార్యదర్శి ఇర్ఫాన్ అహ్మద్ తెలిపారు. జిన్నింగ్ ఫ్యాక్టరీలలో పత్తి నిలువలు అధికం కావడం, 22న సోమవారం కేంద్ర ప్రభుత్వం సీసీఐలకు సెలవు ప్రకటించినందున ఈ నిర్ణయం తీసుకున్నామని రైతులు గమనించి సహకరించాలని ఆయన కోరారు. అదేవిధంగా ఇప్పటివరకు సీసీఐ ద్వారా పత్తి క్వింటాలు 7020 రూపాయల ధర ఉండగా తేది 23జనవరి నుంచి 6920 రుపాయలకు కోనుగోలుచేస్తామన్నారు. ప్రస్తుతంపత్తిలో నాణ్యతా ప్రమాణాలు తగ్గడం మూలంగా పత్తిధర తగ్గిస్తూ నిర్ణయడం తీసుకున్నామన్నారు.

ఎస్ఎంసీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి

లింగాపూర్, జనవరి 20: ప్రభుత్వపాఠశాలల్లో ఎస్ఎంసీ(పాఠశాలల నిర్వహణ కమిటీ) ఎన్నికల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని మండల విద్యాధికారి కుడ్మేత సుధాకర్ అన్నారు. పాఠశాల నిర్వహణ కమిటీ ఏర్పాటుకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదల కావడంతో అన్ని పాఠశాలల్లో ఈనెల 29న ఎన్నికలు నిర్వహించాలన్నారు. 22వతేదీ వరకు అభ్యంతరాలు స్వీకరిస్తామని తెలిపారు. 24వ తేదీన తుదిజాబితాను విడుదల చేస్తామన్నారు. 29న ఉదయం 7నుండి మధ్యాహ్నం 1గంట వరకు ఎన్నికలు నిర్వహిస్తామన్నారు.

రోడ్డుకు మరమ్మతులు

బెజ్జూరు, జనవరి 20: మండలంలో రెబ్బెన నుంచి కొత్తగూడ వరకు ఉన్న గుంతల రోడ్డుకు ఎమ్మెల్యే హరీష్‌బాబు ఆధ్వర్యంలో మరమ్మతులు నిర్వహించారు. కొన్ని సంవత్సరాలుగా రహదారి అంతా గుంతలమయంగా మార డంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఎమ్మెల్యేగా పాల్వాయి హరీష్‌బాబు కల్పిం చుకుని రోడ్డుకు మరమ్మతులు చేయించారు. క్యాక్రమంలో నాయకులు శ్రావణ్, సర్పంచ్ వనిత, సతీష్, శ్రీనివాస్, వెంకటేష్, మహేందర్, చిలుకయ్య, గణేష్ తదితరులు పాల్గొన్నారు.



రోడ్డుకు మరమ్మతులు చేయిస్తున్న బీజేపీ నాయకులు

శిక్షణ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

దహెగాం, జనవరి 20: మేదరి కులస్తులు చేతి వృత్తుల శిక్షణకేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పర్యా టక శాఖాధికారి రామకృష్ణ అన్నారు. శనివారం దహెగాం మండల కేంద్రంలోని రైతువేదికలో నిర్వహిస్తున్న చేతి వృత్తుల శిక్షణకేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నెలరోజుల పాటు నిర్వహించే శిక్షణ కేంద్రంలో వెదురుతో తయారు చేసే కళాకృతులను నేర్చుకోవాలన్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే మేదరి కులస్తులు వెదురుతో విభిన్న కళాకృతులపై మంచి పట్టు సాధించాలన్నారు. మేదరి సంఘం నాయకులు శ్రీనివాస్, సత్యనారాయణ, రవి, వెంకటేష్ శిక్షణ ఇవ్వగా మల్లేష్, శంకర్, గోపాల్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



శిక్షణలో పాల్గొన్న మేదరి కులస్తులు

రేపు మద్యం, మాంసం దుకాణాలు బంద్ చేయాలి

బెజ్జూరు, జనవరి 20: ఈనెల22న అయోధ్యలో రామాలయంలో శ్రీరామ చంద్రుడి ప్రాణప్రతిష్ఠ జరుగుతున్న సందర్భంగా మండలంలో మద్యం షాపులు, మాంసం దుకాణాలు, బెల్టుషాపులు బంద్ చేయాలని కోరుతూ తహసీల్దార్ భూమేశ్వర్‌కు ఎంపీటీసీ పర్వీన్ సుల్తానా, నాయకులు వినతిపత్రం అందజేశారు. అలాగే ప్రభుత్వ, ప్రైవేటుపాఠశాలలు, ఆశ్రమపాఠశాలలు, కళాశాలలకు సెలవు ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జావీద్, అరుణ్, తిరుపతి, రాజేష్, సంజీవ్, తిరుపతి,రవి,చంద్రశేఖర్, సాగర్, చిరంజీవి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక తయారు

సిర్పూర్(టి), జనవరి 20: ప్రభుత్వ ఆదేశాల మేరకు 2024-25 సంవత్సరానికి సంబంధించిన గ్రామ పంచాయతీ ప్రణాళిక తయారు చేసినట్లు ఈవో కృష్ణమూర్తి అన్నారు. శనివారం గ్రామ పంచాయతీలో అభివృద్ధి ప్రణాళికపై పాలకవర్గంతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా, వైద్యం, తదితర అభివృద్ధి పనుల ప్రణాళికను తయారు చేసి ఉన్నతాధికా రులకు సమర్పిస్తామన్నారు. సమావేశంలో ఉపసర్పంచ్ మహేష్, వార్డుసభ్యులు మోహన్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



పురుషోత్తం

బెజ్జూరు, జనవరి 20: ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతున్న కాటేపల్లి గ్రామానికి చెందిన పురుషోత్తం(28) శుక్రవారం రాత్రి మృతి చెందినట్లు ఎస్సై విక్రం తెలిపారు. మృతుడి భార్య సువర్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి: సీఐ శ్రీనివాస్

వాంకిడి, జనవరి 20: వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలని సీఐ శ్రీనివాస్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా జాతీయ రహదారి నాలుగు వరుసల నిర్మాణపనులు భాగంగా జరుగుతున్న నేపథ్యంలో వాహనదారులు, ప్రజలు నిబంధనలు పాటిస్తూ రోడ్డు ప్రమాదాలు జరగకుండా చూసుకోవాలని అన్నారు. జాతీయరహదారిపై వాహనాలునడిపేటప్పుడు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈసందర్భంగా జాతీయ రహదారికి పలుచోట్ల బారికేడ్లను ఏర్పాటు చేశారు.

మహిళలు సైనికుల్లా ఎదగాలి: కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

ఆసిఫాబాద్, జనవరి 20: బాలికలు, మహిళలు, ఉద్యోగినులు ఎలాంటి పరిణామాలనైనా ఎదుర్కొనేందుకు సైనికుల్లా ఎదగాలని కలెక్టర్ హేమంత్‌బోర్కడే అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో బాలికలు, మహిళలు ఎదుర్కొంటున్న లైంగిక వేధింపులపై నిర్వహించిన స్మార్ట్‌యోదా మహిళా స్వశక్తి కార్యక్రమంలో ఆదిలాబాద్ మహిళాస్వశక్తి సమన్వయకర్త మాధవితో కలిసి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాలికలు, విద్యార్థినులు, ఉద్యోగినులు, మహిళలు తమ నిత్యజీవితంలో ఎన్నోరకమైన వేధింపులకు, దాడులకు గురవుతున్నారని అన్నారు. ప్రతి బాలిక, విద్యార్థిని, ఉద్యోగిని, మహిళ గుండె నిబ్బరంతో ఉండి ఎలాంటి పరిణామాలనైనా మనోధైర్యంతో ఎదుర్కొనే విధంగా సన్నద్ధమవ్వాలన్నారు. ప్రతిమహిళా ఓసైనికురాలిగా ఎదగాలన్నారు. వేధింపులపై కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం విద్యార్థులకు లఘుచిత్రంను ప్రదర్శించారు. అనంతరం స్వయం సహాయకసంఘాల మహిళలకు సమస్యలను ఎదుర్కొనే విధానాలపై వివరించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారిణి సావిత్రి, డీఈవో అశోక్, ఉద్యోగులు, షీ టీం సభ్యులు పాల్గొన్నారు.

గంగాపూర్ జాతరను ఘనంగా నిర్వహించాలి..

జిల్లాలోని రెబ్బెన మండలం గంగాపూర్ గ్రామంలో ఫిబ్రవరి23,24,25 తేదీల్లో జరగనున్న బాలాజీ వేంకటేశ్వరస్వామి జాతరను ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ హేమంత్‌బోర్కడే అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో శాసనమండలి సభ్యుడు దండేవిఠల్, ఎమ్మెల్యే కోవ లక్ష్మితో కలిసి దేవదాయ ధర్మాదాయ, పంచాయతీరాజ్, మిషన్‌భగీరథ, రెవెన్యూ సంబంధితశాఖల అధికారులతో జాతరలో పారిశుధ్యం, వాహనాలపార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ సౌకర్యాల ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతరలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీటిపై మిషన్ భగీరథ, భక్తులకు క్యూలైన్ ఏర్పాట్లపై దేవాదాయశాఖ, పారిశుధ్యపనులపై గ్రామపంచాయతీ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని తెలిపారు. జాతరలో తాత్కాలిక మూత్రశాలలు ఏర్పాటుచేసే విధంగా పంచాయతీఅధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ట్రాఫిక్‌సమస్య తలెత్తకుండా అధికారులు నియంత్రణ చర్యలు చేపట్టాలన్నారు. వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేకచర్యలు తీసుకోవాలని తెలిపారు.

అభివృద్ధి పనుల ఎంపికపై గ్రామసభ



గ్రామసభలో పాల్గొన్న అధికారులు, గ్రామస్థులు

వాంకిడి, జనవరి 20: గ్రామపంచాయతీ ద్వారా 2023-24 సంవత్సరంలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు శనివారం వాంకిడి గ్రామ పంచాయతీలో సర్పంచ్ తుకారాం అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ పరిధిలోని వాంకిడి, చిన్నవాంకిడి, ఆకిని గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందించారు. గ్రామపంచాయతీ పరిధిలోని గ్రామాల్లో మురికి కాలువలు, సీసీరోడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరుకు తీర్మానాలు చేశారు. మిషన్‌భగీరథ ద్వారా మంచినీటిసరఫరా సక్రమంగా జరగడంలేదని పైపులైన్లు లీకేజీలు ఉన్నచోట తక్షణమే మరమ్మతులు చేసి తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్యాధికారివినయ్,ఏపీవోశ్రావణ్, కార్యదర్శి శివకుమార్ పాల్గొన్నారు.

జైనూర్: గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసమే గ్రామసభలు అని పట్నాపూర్ గ్రామ సర్పంచ్ కందారె బాలాజీ అన్నారు. మండలంలోని పట్నాపూర్ గ్రామ పంచాయతీలో శనివారం వైద్య సిబ్బంది, అటవీశాఖ అధికారులతో కలిసి జీపీడీపి గ్రామసభను నిర్వ హించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కందారె బాలాజీ మాట్లా డుతూ గ్రామపంచాయతీలో పెండింగులో ఉన్న సమస్యల్ని గ్రామసభలో తెలుసుకుని పరిష్కారంకోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపిస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచులు కుంర కేశవ్‌రావ్, గేడాం సత్యభామ పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ అభివృద్ధికి ప్రణాళిక

ఆసిఫాబాద్ రూరల్, జనవరి 20: ఆసిఫాబాద్ గ్రామ పంచాయతీ అభివృద్ధికి పటిష్ఠ ప్రణాళిక రూపొందిస్తున్నట్లు జిల్లాపంచాయతీ అధికారి అహ్మద్ ఒమర్‌హుస్సేన్ తెలిపారు. పంచాయతీ ఆవరణలో 2024-25కు సంబంధించి అభివృద్ధి ప్రణాళిక రూపకల్పనలో భాగంగా ప్రత్యేకగ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా అభివృద్ధిపనులపై చర్చించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ నాగేశ్వర్‌రావు, ఏఈ సదాశివ్, డీఈ మదిన్, ఈవోవంశీకృష్ణ, కార్యదర్శి రవి, సంతోష్, నాగేందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పడిపోయిన పత్తి ధర



ఎన్నో ఆశలతో సాగుకు శ్రీకారం చుట్టిన అన్నదాతలకు కాలం కలిసి రాకపోవడంతో నష్టాలే మిగిలుతున్నాయి. ఎన్నో కష్టాలతో చేసిన సాగుకు ఫలితం అందక తీరని వెదకు గురవుతున్నారు. అసలే దిగుబడి లేక నష్టాలను చవి చూస్తున్నరైతులకు పత్తిధర పడిపోవడం జీర్ణించుకోలేక పోతున్నారు. సాగుకోసం వేల రూపాయలు అప్పు తెచ్చి మరీ పెట్టుబడి పెట్టగా కనీసం పెట్టుబడులు కూడా రాలేని పరిస్థితి నెలకొంది.

- తగ్గిన దిగుబడి
- రైతులకు కలిసి రాని కాలం
- సరైన సమయంలో వర్షాలు లేక దిగుబడిపై ప్రభావం
- అప్పుల్లో కూరుకుపోతున్న అన్నదాతలు

బెజ్జూరు, జనవరి 20: జిల్లాలో అధికంగా రైతులు వాణిజ్యపంటైన పత్తి వైపు మొగ్గు చూపి సాగు చేశారు. ఈ ఏడాది సమయానికి అనుకూలంగా వర్షాలు లేక పత్తి దిగుబడి పూర్తిగా తగ్గింది. ఉత్పత్తి తగ్గడంతో డిమాండ్ పెరిగి ధర పలుకుతుందనుకున్న రైతుల ఆశలు నెరవేరలేదు. సాగుకు ఒక్కో ఎకరానికి సుమారు 25నుంచి 30 వేల వరకు ఖర్చు చేయగా కనీసం పెట్టిన పెట్టుబడులు కూడా రాని పరిస్థితి తలెత్తడంతో అన్నదాతలు దిగులు చెందుతున్నారు.

పత్తి పంట చేతికొచ్చే దశలో ఒక్క వర్షం కూడా కురవని కారణంగా దిగుబడి అమాంతం తగ్గింది. తొలకరి ఆరంభంలో వర్షాలు ఆలస్యం కావడం. దీనికి తోడు సాగు వెనక్కి వెళ్లడం ఆ తర్వాత సరైన సమయంలో వర్షాలు లేక ఆశించిన స్థాయిలో కాత కాయకపోవడంతో దిగుబడి అమాంతం తగ్గింది.

వర్షాలు లేక తగ్గిన దిగుబడి..

జిల్లాలో ఈ ఏడాది 3.35లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేసినట్లు వ్యవసాయశాఖ అధికారులు గుర్తించారు. పత్తి పంట చేతికొచ్చే సమయంలో వర్షాలు కురవలేదు. దీనికి తోడు పత్తికి తెగుళ్ల ఇతర సమస్యలు రావడంతో రైతులు ఆశించిన మేర దిగుబడి రాలేదు. పెట్టిన పెట్టుబడులకు వచ్చిన దిగుబడికి వ్యత్యాసం చూస్తే కనీసం సాగు కోసం చేసిన పెట్టుబడులు కూడా రాలేదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

పెరిగిన కూలీల రేట్లు..

ప్రస్తుతం పత్తి పంట ఏరివేత సీజన్ కావడంతో రైతులకు కూలీలు కూడా దొరకని పరిస్థితి నెలకొంది. పత్తి ఏరేందుకు ప్రస్తుతం జిల్లాలో కిలోకు రూ.10నుంచి 15 ఇస్తున్నా కూలీల కొరత వేధిస్తోంది, అసలే పత్తి దిగుబడి లేక సతమతం అవుతుంటే కూలీరేట్లు పెరగడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

పత్తి ఏరేందుకు ఇతర ప్రాంతాల నుంచి కూలీలను తీసుకురావాల్సిన పరిస్థితులు తలెత్తుతున్నాయి. ప్రస్తుతం పత్తి ఏరివేత చివరి దశకు చేరడంతో కూలీల కొరత వేధిస్తోంది.

మొన్నటి వరకు మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల నుంచి కూలీలు ఇక్కడ పత్తి ఏరేందుకు వలస వచ్చారు. కాగా కూలీరేట్లు అధికంగా పెరగడం, ఈ ఏడాది పత్తికి ఆశించినస్థాయిలో ధర లేక రైతులు ఆం దోళన చెందుతున్నారు. ప్రస్తుతం పత్తి క్వింటాకు రూ.6500మాత్రమే లభిస్తోంది. దీనికి తోడు పత్తి దిగుబడి కూడా తగ్గడంతో సాగుకు చేసిన ఖర్చులు కూడా రాని పరిస్థితులు ఉన్నాయని రైతులు ఆందో ళన చెందుతున్నారు. మరోవైపు కూలీలు దొరక్క చేలల్లోనే పత్తి ఉండిపోతోందని రైతులు వాపోతున్నారు.

అప్పులు మిగిలాయి..

: సెడ్మెక గుండయ్య, హేటిగూడ



నాకున్న మూడెకరాల వ్యవసాయ చేనులో పత్తి సాగు చేశాను. ఈ ఏడాదిసరైన వర్షాలు లేని కారణంగా పత్తి పంట దిగుబడి తగ్గింది. దీంతో పత్తి పంట సాగుకు చేసిన పెట్టుబడులు కూడా రాలేదు. ప్రభుత్వం స్పందించి మమ్మల్ని ఆదుకోవాలి.

ప్రభుత్వం ఆదుకోవాలి..

: కావుడే నందయ్య, నాగులవాయి



పత్తి పంట సాగు చేసి తీవ్రంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి. ఏటా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా నష్టపోతున్న మాకు ప్రభుత్వం ఎలాంటి సాయం చేయడం లేదు.

కాగజ్‌నగర్ మున్సిపల్ చైర్మన్‌పై నెగ్గిన అవిశ్వాసం



కౌన్సిలర్లను సన్మానించిన కోనేరు కోనప్ప

కాగజ్‌నగర్, జనవరి 20: కాగజ్‌నగర్ మున్సిపల్‌చైర్మన్ సద్దాం హుస్సేన్‌పై పెట్టిన అవిశ్వాసతీర్మానం శనివారం నెగ్గింది. కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో ఉదయం 11.30గంటలకు ఆర్డీవో సురేష్ ఆధ్వర్యంలో అవిశ్వాస తీర్మాన సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి మున్సిపాలిటీకి చెందిన 23మందికౌన్సిలర్లు హాజరయ్యారు. మున్సిపాలిటీలో 30మంది కౌన్సిలర్లు ఉండగా, 2/3వంతు కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా చేతులెత్తారు. దీంతో మున్సిపల్ చైర్మన్‌పై పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గినట్టు ఆర్డీవో సురేష్ ప్రకటించారు. అవిశ్వాసం నెగ్గిన అంశాలను రాష్ట్ర ప్రభుత్వానికి పంపించనున్నట్టు తెలిపారు.

అంతటా టెన్షన్..

మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్‌సద్దాంహుస్సెన్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడుతుండటంతో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటుచేశారు. గుర్తింపు కార్డులున్నవారిని మాత్రమే లోనికి అనుమతించారు. ఉదయం 11.30గంటలకు పాలకవర్గ కౌన్సిలర్లు, మున్సిపల్ చైర్మన్ సద్దాం హుస్సెన్ అనుచరులు వచ్చారు. మాజీ మున్సిపల్ చైర్మన్ దస్తగిర్ అనుచరులతో కాసేపు వాగ్వాదాం జరిగింది. అక్కడే ఉన్న పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టారు. అనంతరం కౌన్సిలర్లందరినీ తనిఖీ చేసి లోనికి పంపించారు. ఉదయంనుంచి 11.30 గంటల వరకు కౌన్సిలర్లు చేతులెత్తుతారా..? లేదా అనే టెన్షన్ ఇరువర్గాల్లో నెలకొంది. మున్సిపల్ చైర్మన్ సద్దాంహుస్సేన్, మాజీ ఎమ్మెల్యే కోనప్పమధ్య ఏర్పడినవిబేధాలు అవిశ్వాసంవరకు వచ్చింది.మాజీ ఎమ్మెల్యే కోనప్పవర్గం ఎలాగైనా అవిశ్వాసం నెగ్గించుకోవాలని ఉద్దేశ్యంతో పావులు కదిపి ఎట్టకేలకు విజయం సాధించింది. అనంతరంమున్సిపల్ కార్యాలయం ఎదుట సంబరాలు జరుపుకున్నారు. కార్యాలయం ఎదుట డ్యాన్సు లు చేశారు. పట్టణ వీధుల గుండా ర్యాలీ నిర్వహించి మాజీఎమ్మెల్యే కోనప్ప నివాసానికి చేరుకొన్నారు. మద్దతు పలికిన కౌన్సిలర్లకు కోనప్ప శాలువాతో సన్మానించారు.

కోనప్పదే తదుపరి నిర్ణయం..

ప్రస్తుత చైర్మన్‌ను దింపేసిన తర్వాత పలువురు కౌన్సిలర్లు మీడియాతో మాట్లాడారు. తమకున్న చైర్మన్ ఇక్కడి వారికి ఏ మాత్రం సమయం కేటాయించలేదన్నారు.కోనప్ప సూచించిన వారికే మద్దతు పలుకుతామని పేర్కొన్నారు.

శివమల్లన్న ఆలయంలో పూజలు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే హరీష్‌బాబు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్‌శ్రీనివాస్

కాగజ్‌నగర్, జనవరి 20: కాగజ్‌నగర్ ఈసుగాం శివ మల్లన్న ఆలయాన్ని శనివారం శుద్ధి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హరీష్‌బాబు పూజలు నిర్వహించారు. వేదపండితులు క్షీరాభిషేక కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్‌శ్రీనివాస్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆవుకు అంత్యక్రియలు

బెజ్జూరు, జనవరి 20: మానవత్వం మరిచి పోయి తల్లిదండ్రులకు అంత్యక్రియలు నిర్వహించని ఈ రోజుల్లో ఓ పురోహితుడు మృతిచెందిన ఆవుకు అంత్యక్రియలు నిర్వహించాడు. బెజ్జూరు మండలకేంద్రానికి చెందిన ఎరోజు సత్యనారాయణచారి అనే పురోహితుడు తాను సాదుకున్న ఆవు మరణించడంతో కన్నీటి పర్యంతమయ్యాడు. మృతిచెందిన ఆవును మనుషుల లాగానే పాడే కట్టించి డప్పులతో తీసుకెళ్లి భూమిలో పాతిపెట్టి గోమాతకు అంత్యక్రియలు నిర్వహించాడు.



మృతిచెందిన ఆవును పాడేపై తీసుకెళ్తున్న పురోహితుడు, గ్రామస్థులు

వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత

- జిల్లా అటవీ శాఖ అధికారి నీరజ్‌కుమార్ టిబ్రేవాల్

పెంచికలపేట, జనవరి 20: వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత అని జిల్లా అటవీశాఖ అధికారి నీరజ్‌కుమార్ టిబ్రేవాల్ అన్నారు. మండలకేంద్రంలోని రైతువేది కలో శనివారం పులిదాడిలో మృతిచెందిన పశువుల యజ మానులకు నష్ట పరిహారం చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పులిదాడిలో పశువులు మృతిచెందితే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించాలన్నారు. పులిదాడి జరిగిన తక్షణమే పశువుల యజమానికి తక్షణ సాయం కింద రూ.5వేలు మంజూరు చేస్తామన్నారు. మృతిచెందిన పశువు పంచనామా అనంతరం దాని మొత్తం విలువ రైతుకు అందజేస్తామని తెలిపారు. వన్యప్రాణులకు ముప్పు తలపెడితే కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అడవిపందులు గ్రామంలో ఉన్న పంటపొలాల్లోకి వచ్చి పంటలను నాశనం చేస్తున్నాయని అయినా నష్ట పరిహారం ఇవ్వడం లేదని పోతెపల్లి సర్పంచ్ చంద్రమౌళి అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఉన్నతాధి కారులకు సమస్యను వివరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్వో దయాకర్, ఇన్‌చార్జి ఎఫ్ఆర్వో సుధాకర్, డీఆర్వో ప్రభాకర్, తహసీల్దార్ వెంకటేశ్వరరావు, ఎంపీడీవో, సర్పంచ్‌లు, తదితరులు పాల్గొన్నారు.

బెజ్జూరు: ఇటీవల పులిదాడిలో మృతిచెందిన జంతువు లకు మంజూరైన నష్టపరిహారాన్ని వాటి యజమానులకు అటవీశాఖ సిబ్బంది అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బెజ్జూరురేంజ్ పరిధిలో గుర్లెమల్లేష్‌కు రూ.16వేలు, మేకల శ్రీనివాస్‌కు రూ.8వేలు చెక్కులను ఎంపీటీసీ పర్వీన్‌సుల్తానా, సర్పంచ్ అన్సార్ హుస్సేన్ చేతుల మీదుగా అందించామన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్వో దయాకర్, ఇన్‌చార్జి ఎఫ్ఆర్వో సుధాకర్, డీఆర్వో ప్రభాకర్, తహసీల్దార్ వెంకటేశ్వరరావు, ఎంపీడీవో సర్పంచ్‌లు పాల్గొన్నారు.



పరిహారం చెక్కులను అందజేస్తున్న జిల్లా అటవీ శాఖ అధికారి నీరజ్‌కుమార్ టిబ్రేవాల్



అఖిల భారత సమ్మెను విజయవంతం చేయండి

శ్రీరాంపూర్, జనవరి 20: దేశవ్యాప్తంగా వచ్చేనెల 16న నిర్వహించే గ్రామీణ బంద్-పారిశ్రామిక బంద్‌ను విజయవంతం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ కోరారు. శ్రీరాంపూర్‌లోని సీఐటీయూ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సీఐటీయూ, వ్యవసాయ, రైతుకార్మిక సంఘాల సంయుక్త సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలో అధికారంలోఉన్న బీజేపీ రైతు, కార్మిక,కర్షకవ్యతిరేక విధానాలను అవలంబిస్తోందన్నారు. కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ప్రభుత్వ నిర్ణయాలను వ్యతిరేకిస్తూ వచ్చేనెల16న దేశవ్యాప్తంగా నిర్వహించే గ్రామీణ-పారిశ్రామిక బంద్‌ను అన్నివర్గాల ప్రజలు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కనికారపు అశోక్, జిల్లా ఉపాధ్యక్షుడు గోమాస అశోక్, నాయకులు నగేష్, బుచ్చన్న, సమ్మక్క, శోభ, రాజేశ్వరి, శ్రీనివాస్, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు హెచ్‌ఆర్‌ఏ చెల్లించాలి

మందమర్రిటౌన్, జనవరి 20: మందమర్రి ఏరియాలోని కేకే ఓసీపీ, ఆర్కేపీ ఓసీపీలో పనిచేస్తున్న క్వార్టర్లు లేని కార్మికులకు హెచ్‌ఆర్‌ఏ వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీబ్రాంచి కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, ఏరియాకార్యదర్శి భీమనాథుని సుదర్శన్ డిమాండ్ చేశారు. శనివారం వారు మాట్లాడుతూ కార్మికుల సమస్యలపరిష్కారం కోసం నిరంతరం పోరాటాలు చేస్తామన్నారు. సమావేశంలో నాయకులు మర్రి కుమారస్వామి, మల్లయ్యనర్సింహారావు పాల్గొన్నారు.

కేకే ఓసీపీ కమిటీ ఎన్నిక

మందమర్రిటౌన్, జనవరి 20: మందమర్రి ఏరియా కేకే ఓసీపీ గుర్తింపు సంఘం పిట్ కమిటీని శనివారం ఎన్నుకున్నారు. పిట్‌కార్యదర్శిగా మర్రి కుమారస్వామి, సహాయకార్యదర్శులుగా రాజేష్‌కుమార్ యాదవ్, గుమాస తిరుపతిని ఎన్నుకున్నట్లు బ్రాంచి కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, భీమనాథుని సుదర్శన్ తెలిపారు.

నూతన భూగర్భ గనులు ఏర్పాటు చేయండి



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

శ్రీరాంపూర్, జనవరి 20: సింగ రేణిలో నూతన భూగర్భ గనులు ఏర్పాటు చేయాలని సింగరేణి గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు శనివారం తెలంగాణ ఉప ముఖ్యమంత్రి, ఇంధనశాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కను కలిసి విన్నవించారు. బొగ్గు గనుల వేలంలో సింగరేణి పాల్గొనేలా చూడాలని, కార్మికులకు సొంతింటి పథకం అమలు చేయాలని, కోల్ ఇండియా మాదిరిగా సింగరేణి కార్మికులకు పెర్క్స్‌పై ఐటీరీయింబర్స్‌మెంట్ ఇవ్వాలని, హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం 149మంది జూనియర్ అసిస్టెంట్లను విధుల్లోకి తీసుకోవాలని, తదితర సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఆయాసమస్యల పరిష్కారానికి మంత్రి హామీఇచ్చినట్లు యూనియన్ నాయకులు పేర్కొన్నారు.

కాంట్రాక్టు కార్మికుల సమస్యలు సైతం..

సమస్యలు పరిష్కరించాలని సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులు మంత్రి మల్లు భట్టి విక్రమార్కను కోరారు. జీవో22ప్రకారం వేతనాలు ఇవ్వాలని, కోల్‌ఇండియా మాదిరిగా హైపవర్ కమిటీవేతనాలు అందించాలని, బోనస్‌ను 20శాతానికి పెంచాలని, లాభాల వాటా ఇప్పించాలని, నర్సరీ కార్మికులకు సీఎంపీఎఫ్ అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ గౌర వాధ్యక్షుడు, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్, అదనపుప్రధాన కార్యదర్శి మిర్యాల రంగయ్య, ఉపప్రధాన కార్యదర్శులు సారయ్య, వీరభద్రయ్య, సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు బుర్ర తిరుపతి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ అక్బర్‌అలీ, బెల్లంపల్లి, కొత్తగూడెం రీజియన్లకార్యదర్శులు అఫ్రోజ్‌ఖాన్, ఎర్రగాని కృష్ణయ్య పాల్గొన్నారు.

కార్పొరేట్, ఆల్టర్నేటివ్ చర్చల ప్రతినిధుల ఎన్నిక

శ్రీరాంపూర్, జనవరి 20: గుర్తింపు సంఘం పక్షాన కార్పొరేట్, ఆల్టర్నేటివ్ చర్చల ప్రతినిధులుగా శ్రీరాంపూర్ ఏరియాకు చెందిన ఏఐటీయూసీ నాయకులు ఎన్నికయ్యారు. ఏఐటీయూసీ కేంద్ర కార్యవర్గ సమావేశం యూనియన్ రాష్ట్రఅధ్యక్షుడు వి సీతారామయ్య అధ్యక్షతన గోదావరిఖనిలో నిర్వహించారు. ఈ సమావేశంలో యూనియన్ ఉప ప్రధానకార్యదర్శులు కె వీరభద్రయ్య, ముష్కె సమ్మయ్య కార్పొరేట్ చర్చల ప్రతి నిధులుగా, శ్రీరాంపూర్ ఏరియా కార్యదర్శి షేక్ బాజీసైదాను ఆల్టర్నేట్ చర్చల ప్రతినిధిగా ఎన్నుకున్నారు. వీరంతా సింగరేణి యాజమాన్యంతో జరిగే అధికారిక సమావేశాలలో పాల్గొంటారు.

ఉద్యోగులకు ఎస్‌ఎల్‌పి పత్రాలు అందజేత

శ్రీరాంపూర్, జనవరి 20: శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే న్యూటెక్ గనికి చెందిన 29మంది ఉద్యోగులకు గ్రూప్ ఏజెంట్ రాముడు, మేనేజర్ స్వామిరాజు శనివారం గని ఆవరణలో ఎస్‌ఎల్‌పి పత్రాలు అందించారు. రాబోయే రోజుల్లో సంస్థ మనుగడ సాధించాలంటే యువఉద్యోగులు గనుల్లో వివిధ బాధ్యతలు స్వీకరించాలని సూచించారు. పనిస్థలాల్లో ప్రమాదాల నివారణకు రక్షణ సూత్రాలను తప్పక పాటించాలన్నారు. అనంతరం ఎస్సీ, ఎస్టి ఉద్యోగుల సంఘం క్యాలెండర్‌ను ముఖ్య అతిథులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో రక్షణాధికారి కొట్టె రమేష్, ఏఐటీయూసీ ఉపప్రధాన కార్యదర్శి ముష్కె సమ్మయ్య, సంక్షేమాధికారి పాల్ సృజన్, పిట్‌కార్యదర్శి ఆకుల లక్ష్మణ్, గజ్జి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి



ఓటరు నమోదు కేంద్రాన్ని సందర్శిస్తున్న జిల్లా రెవెన్యూ అధికారి సురేష్

వాంకిడి/సిర్పూర్(టి)/ కెరమెరి, జనవరి 20: అర్హులైన 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని జిల్లారెవెన్యూ అధికారి సురేష్, తహసీల్దార్లు శ్రీనివాస్, మునావర్ షరీఫ్ అన్నారు. శనివారం వారు వేర్వేరుగా వాంకిడి మండలంలోని జైత్‌పూర్, బెండార, వాంకిడి, బంబార గ్రామాల్లో, సిర్పూర్(టి) మండల కేంద్రంలో, కెరమెరి మండలం ధనోరలో గల ఓటరు నమోదు కేంద్రాలను సందర్శించి ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. 18సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదయ్యేలా బీఎల్‌వోలు కృషిచేయాలన్నారు. ఈనెల 25న జరిగే ఓటరు దినోత్సవ కార్యక్రమాన్ని విజయవంతంఅయ్యేలా కృషిచేయాలన్నారు. ఆర్డీవోవెంట తహసీల్దార్ రహీముద్దీన్, ఎంఆర్ఐ ముబీన్, ఎస్‌ఎంసీ చైర్మన్ ఇఫ్తతుస్సేన్, తదితరులు ఉన్నారు.

అయోధ్య అక్షింతల పంపిణీ

ఆసిఫాబాద్, జనవరి 20: శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర మండలకమిటీ సభ్యులు శనివారం కలెక్టర్ హేమంత్ బోర్కడే, ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఎమ్మెల్సీ దండే విఠల్, జడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు, జిల్లా అధికారులకు అయోధ్య అక్షింతలు, ఫొటోలు పంపిణీ చేశారు. ఈనెల 22న జన్కాపూర్ కోదండ రామాలయంలో జరిగే పుజాకార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సంయోజక్ ఆంజనేయులు, వెంకటే శ్వర్లు, వేణుగోపాల్, కోటేశ్వర్‌రావు, రాజేవ్వర్, శ్రీనివాస్, జి.శ్రీనివాస్, శ్రీకాంత్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలకు అక్షింతలు పంపిణీ చేస్తున్న ట్రస్ట్ సభ్యులు